జగనన్నతోనే గ్రామస్వరాజ్యం

● ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

వంగర: మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పాలన సాగుతోందని చెప్పారు. మండల పరిధిలోని మగ్గూరు, కొప్పరవలస గ్రామాల్లో రూ.1.60 కోట్లతో నిర్మించిన సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల భవనాలను శుక్రవారం ప్రారంభించారు. ముందుగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు పోలిరెడ్డి రమేష్, సాదెం లలితకుమారి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ, ప్రతి గ్రామంలోనూ సుమారు కోటి రూపాయల విలువ చేసే కొత్త భవనాలు నిర్మించి ప్రజలకు అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఉన్నారని తెలిపారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేస్తున్నారని కొనియాడారు. పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ఇంటి ముంగిటకే పాలన తీసుకువచ్చిన ధీశాలి జగన్ మోహన్‌రెడ్డి అని కొనియాడారు. వలంటీర్ వ్యవస్థతో ఇంటింటికీ ప్రభుత్వ పథకాలు చేరవేస్తున్నారని చెప్పారు. విద్య, వైద్యరంగాలకు ఎనలేని ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. ఆరోగ్యశ్రీతో లక్షలాది మంది ప్రాణాలు కాపాడారని చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే టీడీపీ, జనసేన నాయకులు ఎల్లో మీడియా సహకారంతో దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. 2024లో జరగనున్న ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయడమే మనందరి లక్ష్యమన్నారు. అనంతరం సచివాలయాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, సాదెం శ్రీరామ్మూర్తి, పోలిరెడ్డి లక్ష్మి, ఉగిరి ముత్యాలు, యలకల శ్రీనివాసరావు, యలకల వాసునాయుడు, పారిశర్ల రామకృష్ణ, కిమిడి చిట్టిబాబు, బెవర మురళీకృష్ణ, తూముల నారాయణరావు, సాదెం కోటేశ్వరరావు, బొక్కెల వెంకటప్పలనాయుడు, ఆవు చిన్నప్పలనాయుడు, బోరెడ్డి సంగంనాయుడు, ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు, డీటీ బూరాడ సుందరరావు, ఈఓపీఆర్‌డీ లోపింటి త్రినాథ్, సచివాలయాల ఉద్యోగులు, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మగ్గూరు సచివాలయం భవనాన్ని రిబ్బన్ కట్‌చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్



కొప్పరవలస సచివాలయం, ఆర్బీకే సెంటర్, హెల్త్‌వెల్‌నెస్ సెంటర్లును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

బొబ్బిలి: రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పిరిడి గ్రామంలో శుక్రవారం పర్యటించిన ఆయనకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. దేశంలోని ఏ రాష్ట్రంలో అమలుకానన్ని సంక్షేమ పథకాలను రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. అలాగే ప్రతీ సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులు జోరుగా కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్రంలో పలుచోట్ల పోర్టులు, విమానాశ్రయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. వాస్తవానికి టీడీపీ హయాంలో చంద్రబాబు చేసిన అప్పుల కన్నా ఇప్పుడేమీ ఎక్కువ అప్పులు చేయలేదన్నారు. అప్పటి రాష్ట్ర బడ్జెట్, ఇప్పటి రాష్ట్ర బడ్జెట్ ఒకటే అయినా అప్పట్లో ఇప్పుడున్న సంక్షేమ పథకాలను ఎందుకు అమలు చేయలేదు.. అభివృద్ధి పనులు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా అప్పటి జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు లంచాలకు తావులేకుండా అర్హతే ప్రామాణికంగా, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు, అభివృద్ధి పనులు మంజూరు చేయడం జరుగుతోందన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ సీఎం జగనన్ననే ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎస్.వేణుగోపాల నాయుడు, సర్పంచ్ టి.వరలక్ష్మి, ఎంపీడీఓ పి. రవికుమార్, కోమటిపల్లి పీఏసీఎస్ చైర్మన్ వి.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారు మహిళ అందుకున్న సంక్షేమ పథకాలను చదివి, వినిపిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

ప్రభుత్వ స్థలం పరిశీలన

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి కొండంపేటలో ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూమిని కమిషనర్ డీటీవీ కృష్ణారావు శుక్రవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన కొంతమంది ఆక్రమణలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో, తాను పరిశీలనకు వచ్చినట్లు కమిషనర్ చెప్పారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తానని తెలిపారు.

క్లుప్తంగా

సక్రమంగా విధులు నిర్వహించాలి



చిన్నారులతో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రజని

వంగర: అంగన్‌వాడీ కార్యకర్తలు విధులు సక్రమంగా నిర్వహించాలని, పని వేళలు పాటించాలని ఐసీడీఎస్ వంగర సెక్టార్ సూపర్‌వైజర్ జి.రజని తెలిపారు. మండల పరిధిలోని మగ్గూరు-3 అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె పరిశీలించింది. ప్రీ స్కూల్ నిర్వహణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ పంపిణీపై సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త సీహెచ్.అప్పలనరసమ్మ ఉన్నారు.

అర్థమయ్యేలా బోధన



స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్‌లకు సూచనలిస్తున్న డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీ

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పిల్లలకు అర్థమయ్యేలా బోధించాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి బ్రహ్మాజీ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠ్యప్రణాళిక సరైన సమయంలో పూర్తి చేయాలన్నారు. టీఎల్ఎం సహాయంతో బోధన చేస్తే మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. అనంతరం రేగిడి ఉన్నత పాఠశాలను పరిశీలించి, జగనన్న గోరుముద్ద పథకంపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎంవీ ప్రసాదరావు, బి.ఎరకయ్య పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలి

రామభద్రపురం: తమకు కనీస వేతనం చెల్లించాలని పారిశుద్ధ్య కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై వారు సీఐటీయూ నేత బలస శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రిలే నిరాహార దీక్ష శుక్రవారం చేపట్టారు. వారు మాట్లాడుతూ వారం రోజులుగా సమ్మె, రాస్తారోకోలు చేసినా తమ సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ పారిశుద్ధ్య కార్మికునికి నెలకు రూ.10 వేల చొప్పున వేతనం ఇవ్వాలని ప్రభుత్వం జీఓ జారీ చేసినా అధికారులు దానిని పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విడుదల చేసిన జీఓను అమలు చేసి, తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మిక సంఘం సభ్యులు కారంగి భవాని, కారంగి శ్యామల, కె.కనకరాజు, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

20 టన్నుల పీడీఎస్ బియ్యం పట్టివేత



బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకుంటున్న ఏఎస్ఓ అశోక్‌కుమార్, సివిల్ సప్లయి సిబ్బంది

బాడంగి: మండలంలోని డొంకినవలస రైల్వేస్టేషన్ కాలనీలో అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేసిన 20 టన్నుల పీడీఎస్ బియ్యంను సివిల్ సప్లయి అధికారులు శుక్రవారం పట్టుకుని, స్వాధీనం చేసుకున్నారు. ఇదే గ్రామానికి చెందిన వ్యాపారి వెంకటరమణకు చెందిన ఓ ప్రైవేటు గొడౌన్‌లో ఉన్న ఈ బియ్యానికి సంబంధించి, ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో వాటిని బ్లాక్‌లో కొనుగోలు చేసి, తరలించేందుకు సిద్ధం చేసినట్లు నిర్ధారించి, 6-ఏ కింద కేసు నమోదు చేశారు. ఈ బియ్యం విలువ రూ.3 లక్షల వరకు ఉంటుందని అంచనా. ముందస్తు సమాచారం మేరకు బియ్యాన్ని పట్టుకున్నట్లు విజయనగరం సివిల్ సప్లయి ఏఎస్ఓ అశోక్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీలు స్వర్ణలత, సాయికృష్ణ, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్ట్

వంగర: మండల పరిధి శివ్వాంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కొక్కిరిగెడ్డ రామును శుక్రవారం అరెస్టు చేసి, అతని నుంచి 13 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై ఆర్. జనార్దనరావు తెలిపారు. నిందితుడిని పాలకొండ జ్యుడీషియల్ కస్టడీకి తరలించామన్నారు.

జగనన్న సురక్షతో ప్రజల వద్దకే సేవలు



మల్లంపేటలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి



రేగిడి : కందిశలో ధ్రువపత్రాలు అందిస్తున్న ఎంపీడీఓ నాగమణి

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని మల్లంపేట, కంచర వీధి సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు చేతులమీదుగా అర్జీదారులకు పలు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో అవినీతికి తావులేదన్నారు. చాలా పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు, సిటిజన్ సర్వీసులు అందిస్తున్నారన్నారు. జగనన్న ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా టీడీపీ జన్మభూమి కమిటీల అరాచకాలకు బ్రేక్ పడిందన్నారు. అప్పట్లో ఏ పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా జన్మభూమి కమిటీలకు లంచం చెల్లించాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు, సిటిజన్ సర్వీసులు అందిస్తున్నారన్నారు. గొల్లపల్లి సూర్య కల్యాణ మండపంలో చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు మాట్లాడుతూ పట్టణంలోని పూల్‌బాగ్ రోడ్డు బాగాలేదని టీడీపీ నేత బేబీనాయన పాదయాత్ర చేస్తానని చెబుతున్నారని, ఆయన పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారని ప్రశ్నించారు. పూల్‌బాగ్ రోడ్డు కోసం రూ.40 లక్షలు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు చేపడతామని తెలిపారు. కార్యక్రమాల్లో పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఐ.గోపాలరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ టి.పార్వతి, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ రేజేటి విస్సు తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ..

రేగిడి: మండలంలోని కందిశ, సరసనాపల్లి గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ నాగమణి, తహసీల్దార్ టి.కల్యాణ చక్రవర్తి ఆయా గ్రామాల్లోని లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కర్రి అప్పలనాయుడు, కెల్ల మన్మధరావు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను వినియోగించుకోండి..

రాజాం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలంతా వినియోగించుకోవాలని ఎంపీడీఓ బాసూరీ శంకరరావు సూచించారు. మండలంలోని సోపేరులో శుక్రవారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించి, అవసరమైన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.28 లక్షలతో సుందరాడ-రాముడువలస రోడ్డు నిర్మాణం



సుందరాడ-రాముడువలస గ్రామాల మధ్య జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులు

తెర్లాం: మండలంలోని సుందరాడ-రాముడువలస రోడ్డు పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. గత కొన్నేళ్లుగా ఈ రోడ్డు పనులు జరగకపోవడంతో సుందరాడ, రాముడువలస తదితర గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా ఈ రోడ్డును పట్టించుకునే వారే కరువయ్యారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్డు నిర్మాణానికి రూ.28 లక్షలు మంజూరు చేసింది. వీటితో ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరితగతిన పనుల పూర్తికి చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ అద్దంకి దిలీప్‌కుమార్ తెలిపారు.

ఆటపాటలతో కూడిన విద్యనందించాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీఓ రాజ్యలక్ష్మి

బాడంగి: అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రీస్కూల్ చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందించి, అభ్యసనంపై ఆసక్తి పెంచాలని ఐసీడీఎస్ పీఓ కె.రాజ్యలక్ష్మి సూచించారు. శుక్రవారం స్థానిక స్వామి కల్యాణ మండపంలో మూడు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆమె కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం తప్పనిసరిగా క్రమం తప్పకుండా ఇవ్వాలని తెలిపారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిజాయితీతోనే గుర్తింపు



హెడ్ కానిస్టేబుల్ వెంకటరావుతో పాటు పోలీసు సిబ్బందిని సన్మానిస్తున్న సీఐ ఉపేంద్రరావు, ఎస్సై జనార్దనరావు

వంగర: నిజాయితీగా విధులు నిర్వహిస్తే గుర్తింపు లభిస్తుందని రాజాం రూరల్ సీఐ హెచ్. ఉపేంద్రరావు అన్నారు. వీఆర్ఎస్ పొందిన హెడ్ కానిస్టేబుల్ పి.వెంకటరావుతో పాటు వంగర పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై వెళ్లిన బి.విజయ్‌కుమార్, బి.గౌరీశ్వరి, దూబ హరిబాబు, జి.వెంకటరమణలను పోలీసు సిబ్బంది శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, విధులు ఎంత ముఖ్యమో కుటుంబాలకు కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఆర్.జనార్దనరావు, హెడ్‌కానిస్టేబుళ్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పక్కాగా ఓటర్ల జాబితా తయారీ



సూచనలిస్తున్న ఆర్‌డీఓ శేషశైలజ

బాడంగి: ఓటర్ల జాబితా తయారీ పక్కాగా ఉండాలని బొబ్బిలి ఆర్‌డీఓ పి.శేషశైలజ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్ఓలతో శుక్రవారం సమావేశమైన ఆమె ఓటర్ల జాబితా తయారీపై దిశానిర్దేశం చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాలనుసారం ఓటర్ల జాబితా తయారు చేయాలన్నారు. ఇంటింటా సర్వే చేసి, ఓటర్ల జాబితాలో కొత్తవారిని చేర్చడం, మృతుల వివరాలను తొలగించడం వంటివి చేయాలన్నారు. ఒక కుటుంబ సభ్యులంతా ఒకే పోలింగ్ బూత్ పరిధిలో ఓటర్లుగా తమ ఓటుహక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎటువంటి అవకతవకలు లేకుండా పారదర్శకంగా ఓటర్ల జాబితా ఉండాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ రఫీజాన్, ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ, సీఎస్‌డీటీ భాస్కరరావు, ఎన్నికల డీటీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఆవిష్కరణల పోటీలకు రేగిడి పాఠశాల ప్రాజెక్ట్



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, తదితరులు

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో నూతన ఆవిష్కరణల ఆలోచనలు పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, యునిసెఫ్ రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్లో ఇటీవల పోటీలు నిర్వహించాయి. ఈ పోటీల్లో విజయనగరం జిల్లా నుంచి రేగిడి పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం వావిలపల్లి లక్ష్మణరావు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పదివేల ప్రాజెక్టులు ఈ పోటీల్లో పాల్గొనగా, 26 ప్రాజెక్టులను రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న ఇన్నోవేషన్ పోటీలకు ఎంపిక చేశారని ఆయన తెలిపారు. రేగిడి ఉన్నత పాఠశాలకు చెందిన జీవశాస్త్ర ఉపాధ్యాయిని బూరవెల్లి ఉమామహేశ్వరి గైడెన్స్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయికి ఎంపికైందన్నారు. ఈ మేరకు విద్యార్థులను పాఠశాల ఆవరణలో శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు, విద్యా కమిటీ చైర్మన్ ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద రాజం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించే విధానాలపై వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. పంటల మార్పిడి విధానాన్ని అమలు చేయాలని సూచించారు. ఖరీఫ్ సాగుకు సరిపడా అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, వస్తుసామాగ్రిని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లావేటి రాజగోపాల నాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నరసింహులు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, వ్యవసాయశాఖ ఎ.డి కె.చంద్రరావు, ఎంపీడీఓ బాసూరీ శంకరరావు, వ్యవసాయశాఖ ఏఓ రేణుకాసాయి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

చోడి సాగును ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు



బాడంగి: మాట్లాడుతున్న జెడ్పీటీసీ రామారావు

రామభద్రపురం: చోడి సాగును ప్రోత్సహించాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు వ్యవసాయాధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ చొక్కాపు తవిటినాయుడు అధ్యక్షతన జరిగిన మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ హాజరయ్యారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు ముందస్తుగానే రైతులకు అవసరమైన వరి విత్తనాలు, పచ్చిరొట్ట విత్తనాలు సకాలంలో సరఫరా చేశామని, ఎరువులు కూడా సిద్ధంగా ఉన్నాయని ఏఓ వెంకటయ్య ఎంపీపీ, మండలి సభ్యుల దృష్టిలో పెట్టారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు విత్తనాల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అలాగే సాగుకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఎం.సాగర్‌సాయి, పి.ఏక్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: ఖరీఫ్ సాగుకు సంబంధించి, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జెడ్పీటీసీ పెద్దింటి రామారావు సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా సంఘ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను అందివ్వాలన్నారు. అలాగే రైతులకు సాగుకు సంబంధించి, సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. రైతులు ఇబ్బందులు పడకుండా రాష్ట్ర ప్రభుత్వం కూడా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల ద్వారా సేవలందిస్తోందన్నారు. ఏఓ శిరీష మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 1,440 క్వింటాళ్ల వరి, వేరుశనగ, పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను రాయితీపై రైతులకు అందజేశామని తెలిపారు. అలాగే 394 మెట్రిక్ టన్నుల యూరియా, 170 మెట్రిక్ టన్నుల డీఏపీ, 12 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు తెప్పించి, రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. కౌలురైతులు వీఆర్‌ఓల నుంచి సీసీఆర్‌సీ కార్డులు పొంది, ప్రభుత్వ రాయితీలు పొందాలని కోరారు.

సంక్షిప్తంగా...

తూనికల్లో తేడాలుంటే చర్యలు

సంతకవిటి: తూనికలలో తేడాలుంటే కఠిన చర్యలు ఉంటాయని బొబ్బిలి తూనికలు, కొలతల అధికారి కె.బలరామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని పలు దుకాణాల్లో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారికి అపరాధ రుసుం విధించారు.

రేషన్‌కార్డులో మార్పులకు అవకాశం

రాజాం సిటీ: రేషన్‌కార్డులో స్ప్లిట్టింగ్‌కు (వేరు పడేందుకు) అవకాశం కల్పిస్తున్నట్లు సీఎస్‌డీటీ చిరంజీవిరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్‌కార్డు నుంచి వేరుపడేందుకు ఎదురుచూస్తున్న వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. సంబంధిత సచివాలయాల్లో ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

రేపు వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం

బాడంగి: మండల కేంద్రంలోని శివాలయం పక్కనే ఉన్న ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైద్య శిబిరం ఇన్‌చార్జ్ వెంకటరమణ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డులతో శిబిరానికి హాజరు కావాలని కోరారు.

నేడు నీటి సరఫరా నిలిపివేత

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాలకు శనివారం నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు కమిషనర్ డీటీవీ కృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డోలపేట వద్ద ప్రధాన పైపులైన్ శిథిలమైందని, దీంతో డోలపేట, బుచ్చెంపేట, పొనుగుటివలస, మారుతీనగర్, వరలక్ష్మీనగర్, విద్యానగర్ ప్రాంతాలకు నీటి సరఫరాకు ఉండదని పేర్కొన్నారు. మరమ్మతుల అనంతరం సరఫరా పునరుద్ధరిస్తామన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఆరుగురు విద్యార్థుల ఎంపిక

రేగిడి: మండలంలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈఓలు ఎంవీ ప్రసాదరావు, బి.ఎరకయ్య తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ, లింగాలవలస జెడ్పీ హైస్కూల్‌కు చెందిన వి.బస్వంత్, ఎం. ధర్మతేజ.. అంబఖండి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన పల్లి శిరీష.. రేగిడి జెడ్పీ హైస్కూల్‌కి చెందిన గేదెల మహాలక్ష్మి.. ఖండ్యాం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన కె.మదన్, కె.వెంకటసాయి ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారన్నారు. ఈ మేరకు విద్యార్థులను అభినందించారు.

పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాలి



రాజాంలో ర్యాలీ నిర్వహిస్తున్న వలంటీర్లు

రాజాం: వలంటీర్లను కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన పవన్ కల్యాణ్ వెంటనే క్షమాపణ చెప్పాలని రాజాం మండలానికి చెందిన వలంటీర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాజాంలోని బొబ్బిలిరోడ్డులో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడి పవన్ కల్యాణ్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. చంద్రబాబు ఇచ్చే ప్యాకేజీ కోసం టీడీపీ స్క్రిప్ట్ చదివి ఊగిపోతున్న పవన్ కల్యాణ్‌కు గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందన్నారు.